ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | బుధవారం | 05.08.2026 | సంపుటి : 2 | సంచిక : 34 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


## పకడ్బందీగా పోలీస్
# ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

### అన్ని దశల్లో అప్రమత్తంగా ఉండాలి

**పోలీస్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే నిఘా ఏర్పాటు చేయాలి**

**పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**


**హోం శాఖ ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

పోలీస్ ఉద్యోగాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలని హోం శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతోపాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘావర్గాలు ఆయన దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో... డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్, ఆగస్ట్ 4 : రాష్ట్రంలో 7,437 పోస్టుల భర్తీని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతోపాటు అన్ని దశల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియామక పరీక్షల నిర్వహణపై సామాజిక, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా నియంత్రించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా అకౌంట్లపై సైబర్‌క్రైమ్ విభాగంతో

-మిగతా 2 లో..




### థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే 'నో ఫ్యూయల్' సుప్రీం కోర్టు




### మరో బాదుడుకు ట్రంప్ సిద్ధం

హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు



## సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

**బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు**

**2022-23 నాటి బకాయిలే రూ. 3,572 కోట్లు రావాలి**

**డిఫాల్ట్ మిల్లర్లపై విజిలెన్స్ దాడులు**

**,క్రిమినల్ కేసులు, బ్లాక్‌లిస్టింగ్ తప్పదు**

**పౌరసరఫరాల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ**

హైదరాబాద్, ఆగస్ట్ 4 : తెలంగాణ ఏర్పాటైన 2014 నుంచి 2025 వరకు రాష్ట్రంలోని మిల్లర్లు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ ద్వారా అప్పగించాల్సిన రూ. 13,399.71 కోట్ల విలువైన 59.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాయం చేశారు. పౌరసరఫరాల శాఖ నయానో, భయానో హెచ్చరికలతో ఇందులో నుంచి 31.73 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని, లేదా దానికి సమానమైన మొత్తం విలువ రూ. 6,768.97 కోట్లు రికవరీ చేసింది. అయినా ఇంకా మిల్లర్ల నుంచి రూ. 6,630.74 కోట్ల విలువైన 28.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ఇందులో 2022–23 రబీకి సంబంధించి 15.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికీ రికవరీ కాలేదు. దాని విలువ ఏకంగా రూ.3,572 కోట్లు. ఇదే సీజన్‌లో ఏకంగా రూ.8,069 కోట్ల విలువైన 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాయం చేస్తే, ప్రభుత్వం రికవరీ సంస్థలను పెట్టి మరీ రూ.4,497 కోట్ల విలువైన 22.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లేదా దానికి సమానమైన నగదును రికవరీ చేసింది. తాజాగా గత ఖరీఫ్‌లో అప్పగించిన సన్నధాన్యం నుంచి కూడా సుమారు

-మిగతా 2 లో..



## ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ 'టీ-ఫైబర్' ఇంటర్నెట్

హైదరాబాద్, ఆగస్ట్ 4 : రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేవలం 'టీ–ఫైబర్' ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'టీ–ఫైబర్' ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ–ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..నిర్దేశిత గడువులోగా (సెప్టెంబర్ 1) రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ప్రైవేట్ ఇంటర్నెట్

-మిగతా 2 లో..

## అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా?

**డిసిపి ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు**

**రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా**

**సీఎం రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి విమర్శలు**

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.



హైదరాబాద్,ఆగస్ట్4 : రాజ్యాంగం ప్రకారం పని చేసిన డిసిపిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని కిషన్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం

-మిగతా 2 లో..

## శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద

**2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 107 టీఎంసీలకు చేరిన నిల్వ**

**ఎగువన వర్షాలతో కొనసాగుతున్న ప్రవాహం**

శ్రీశైలం జలాశయంలో నీటినిల్వలు వేగంగా పెరుగుతున్నాయి. సోమవారం జూరాల ప్రాజెక్టు నుంచి 2.21 లక్షల క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేశారు. రోజూ లక్ష క్యూసెక్కులకు పైగా ప్రవాహ ఉధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యాం సీఈ కబీర్ బాషా తెలిపారు.



శ్రీశైలం, ఆగస్ట్ 4 : కృష్ణా బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలంలోకి భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, బుధవారం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఆలమట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులు విడుదల చేయగా, నారాయణపుర్ నుంచి 1.48 లక్షల క్యూసెక్కులు వదిలారు. భీమా నుంచి వచ్చిన నీటితో కలిపి జూరాలకు 2.41 లక్షల క్యూసెక్కులు రాగా, 2.53 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, జూరాల కుడి,

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74



## మత్స్యకారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం

**మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి**

హైదరాబాద్,ఆగస్ట్4 : మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు

-మిగతా 2 లో..

## కల్తీ మసాలాల తయారీ

**నగరంలో 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం**

**13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు**

**కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు**

**కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం**

**ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు**

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**



హైదరాబాద్, ఆగస్ట్ 4 : ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ –ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల

-మిగతా 2 లో..

## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**

**కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**

హైదరాబాద్, ఆగస్ట్ 4 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర



-మిగతా 2 లో..

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయెల్, పోలీస్ నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, హైదరాబాద్ కమిషనర్ వి.సి.సజ్జనర్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పలు సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి దిల్లీకి వెళ్లారు. సీతారామ ఎత్తిపోతలు, పాలమూరు–రంగారెడ్డి, డిండి, గౌరవెల్లి తదితర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో బుధవారం ఆయన భేటీ కానున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ తదితరులు కూడా సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలువురు ఏఐసీసీ పెద్దలను కలిసే అవకాశాలున్నట్లు తెలిసింది.

## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

(మొదటిపేజీ తరువాయి)



ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷–లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా?

(మొదటిపేజీ తరువాయి)




ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్–2, మణుగూరు బ్లాక్‌లను.. సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.



## ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ 'టీ–ఫైబర్' ఇంటర్నెట్

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేటర్లను ఉపయోగిస్తే, వారికి ఎలాంటి ప్రభుత్వ బిల్లులు చెల్లించబోమని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకట్ట వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న టీ–స్వాన్ నెట్‌వర్క్‌ను రాబోయే నెల రోజుల్లోగా పూర్తిగా టీ–ఫైబర్ పరిధిలోకి బదిలీ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగవంతం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'కి కూడా పూర్తిస్థాయిలో నాణ్యమైన టీ–ఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందేలా ఇప్పటి నుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను నిర్దేశించారు. దీంతో పాటు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని చేరవేసే ఇంటింటికి ఇంటర్నెట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, అనుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని టీ–ఫైబర్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కల్తీ మసాలాల తయారీ

(మొదటిపేజీ తరువాయి)



ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ –ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఊ– ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద



(మొదటిపేజీ తరువాయి)

ఎడమకాలువలతో సహా అన్ని కాలువలకు నీటిని విడుదల చేశారు. తుంగభద్రకు కూడా వరద ప్రవాహం పెరిగి 82 వేల క్యూసెక్కులకు చేరింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ 55 టీఎంసీలకు చేరింది. పూర్తిగా నిండటానికి మరో 50 టీఎంసీలు అవసరం. శ్రీశైలంలో బుధవారం సాయంత్రానికి నీటినిల్వ 107 టీఎంసీలకు చేరగా.. నిండటానికి మరో 108 టీఎంసీలు కావాలి. నాగార్జునసాగర్ నిండటానికి ఇంకా 170 టీఎంసీలు రావాల్సి ఉంది. 250 టీఎంసీల నిల్వ చేరితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు నాగార్జునసాగర్ ఎడమకాలువ, ఎం.ఆర్.ఆర్.పి, కల్వకుర్తి ఇలా అన్ని ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉంటుందని నీటిపారుదలశాఖ వర్గాల అంచనా. ప్రస్తుత ప్రవాహం కనీసం పది రోజులకు పైగా కొనసాగితేనే ఇది సాధ్యమవుతుంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 22 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. మధ్యాహ్నం 28 వేల క్యూసెక్కులు వచ్చినా సాయంత్రానికి కొంత తగ్గింది. ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 35 టీఎంసీల నిల్వ ఉండగా, నిండటానికి మరో 45 టీఎంసీలు అవసరం. డెడ్ స్టోరేజీ పోను 20 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇవి తాగునీటి అవసరాలకు సరిపోతాయి. ఎగువన మహారాష్ట్రలో అన్ని ప్రాజెక్టులు నిండిన నేపథ్యంలో రానున్న రోజుల్లో వచ్చే ప్రవాహం కీలకం కానుంది. నిజాంసాగర్‌లో 10 టీఎంసీలు ఉండగా, 7 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రాజెక్టు ఆయకట్టుకు కొంత నీటిని ఇవ్వడానికి అవకాశం ఏర్పడింది. కడెం, ఎల్లంపల్లిలు పూర్తిస్థాయి నిల్వలతో ఉన్నాయి. ఎల్లంపల్లికి ప్రవాహం తగ్గి 5 వేల క్యూసెక్కులు రాగా, ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు 12 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మధ్యమానేరులో 16 టీఎంసీలు ఉండగా, స్థానికంగా కురిసిన వర్షాలతో కలిపి 18,645 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రాజెక్టు నిండటానికి మరో 10 టీఎంసీలు అవసరం. ఎగువ మానేరుకు 5,666 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. మానేరుకు వరదతో అన్నారం బ్యారేజీకి 10 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రాణహితలో వరద ప్రవాహం తగ్గింది. మేడిగడ్డ బ్యారేజి వద్ద 1.74 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది.

## మత్స్యకారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ కెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## నల్ల కాగితాలతో 500 నోట్లు అంటూ బురిడీ

### కోటి కోసం 13 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్4 :** రూ.కోటి వస్తుందని నమ్మి రూ.13 లక్షలు పోగొట్టుకున్న సంఘటనలో నిందితుణ్ని అరెస్టు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అశ్వారావుపేట ఠాణాలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. ఏపీలోని ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన పత్తిపాటి ప్రేమ్‌చంద్ కొన్నాళ్ల కిందట అశ్వారావుపేట వచ్చి ఫైర్ కాలనీలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి మోసపూరితంగా సంపాదించే మార్గాలను ఎంచుకున్నాడు. అశ్వారావుపేటకు చెందిన వ్యాపారి మధుబాబును గత ఏడాది డిసెంబరులో కలిసి తనకు రూ.15 లక్షలు ఇస్తే రూ.కోటి ఇస్తానని మాయమాటలు చెప్పాడు. నోట్లను క్షణాల్లో తయారు చేస్తానని నమ్మించి రసాయనాలు కలిపిన నీళ్లలో నల్లని కాగితాలను ముంచి అప్పటికే చేతి వేళ్ల మధ్య అసలు నగదు నోట్లు దాచి ఉంచిన అసలు రూ.500 నోట్లుగా మారినట్లు నమ్మించాడు. కొద్దిరోజుల్లోనే నల్లని కాగితాలను నోట్లుగా తయారు చేసి రూ.కోటి ఇస్తానని చెప్పాడు. దీనికి రూ.15 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇది నమ్మిన మధుబాబు నిందితుడికి తొలి విడతగా రూ.11 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత రసాయనాలు కొనుగోలు చేయాలని చెప్పడంతో మరో రూ.2 లక్షలు ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా ఇస్తానన్న రూ.కోటి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ÷ర్ కాలనీలో నిందితుడు ప్రేమ్‌చంద్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.500 నోట్ల పరిమాణంలో కత్తిరించిన 20,000 నల్లటి కాగితాలు 20 కట్టలు, రెండు రసాయనాల సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మస్థయిర్యం దెబ్బతీస్తారా

### సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి అర్వింద్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఆగస్ట్4 :** ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

## సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)



రూ.500 కోట్ల విలువైన ధాన్యం మాయం చేయగా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల ద్వారా రూ.250 కోట్ల మేర రికవరీ చేశారు. మంగళవారం సచివాలయంలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2014 నుంచి ఇప్పటి వరకు మిల్లర్లు దోచేసిన రూ.వేలకోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్‌లపై సమీక్షించారు. కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ డీఎస్.చౌహాన్, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో పాటు ఇతర ముఖ్యమైన అధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ రూ.వేలకోట్ల విలువైన ధాన్యం గల్లంతు కావడం, కస్టమ్ మిల్లింగ్ రైస్ దారి మళ్లడంపై తీవ్రంగా స్పందించారు. 2014 నుంచి ఇప్పటి వరకు ఏ సంవత్సరంలో ఏ సీజన్‌లో ఎంత మొత్తం ధాన్యాన్ని మిల్లర్లు మాయం చేస్తే, ప్రభుత్వం ఎంత మేర రికవరీ చేసిందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి అధికారులకు వివరించారు. మిల్లర్లు మాయం చేసిన ధాన్యంలో సగానికి పైగా రికవరీ చేయించినప్పటికీ, మిగతా మొత్తాన్ని ఎందుకు వసూలు చేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ధాన్యాన్ని దారి మళ్లించే, కస్టమ్ మిల్లింగ్ ఒప్పందాలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై విజిలెన్స్ దాడులు మరింత ముమ్మరం చేస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బ్లాక్‌లిస్టింగ్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు వల్ల ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు వివరించగా, మిగిలిన ప్రతి కేసును మిల్లర్ వారీగా సమీక్షించి గడువు నిర్ధారిస్తూ ప్రత్యేక రికవరీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు.

## థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే 'నో ఫ్యూయల్' : సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** ఇన్సూరెన్స్ లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరగడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇందుకు సంబంధించి కీలక తీర్పు వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం.. వీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ముఖ్యంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించాలని, ఇందుకోసం ఓ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని సూచించింది. మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనలను పాటించకపోవడాన్ని ప్రస్తావించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. దేశంలోని రహదారులపై తిరుగుతున్న వాటిలో సగానికిపైగా వాహనాలకు బీమా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. బీమా లేని వాటికి బంకుల్లో ఇంధనం నిరాకరించడం వల్ల రెండు ప్రయోజనాలు ఉంటాయని సుప్రీం కోర్టు పేర్కొంది. బీమా లేని వాహనాలను గుర్తించడం, మరోవైపు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉందా?లేదా అనే విషయం యజమానులకు తెలియజేయడంలో దోహదపడుతుందని అభిప్రాయపడింది.జాతీయ రహదారులపై భారీ సంఖ్యలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, టోల్ ప్లాజాల వద్ద ఏర్పడుతున్న పొడవైన క్యూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఇటువంటి కారిడార్లలో పైలట్ ప్రాజెక్టులను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# తెలుగుభాషకు మండలి కృషిప్రశంసనీయం

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విజయవాడ,ఆగస్ట్4 :** దేశానికి, తెలుగు భాషకు మండలి వెంకటకృష్ణారావు చేసిన సేవలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ఏది ప్రారంభించాలన్నా రిబ్బన్ కత్తిరించడం సరికాదన్నారు. అది బ్రిటీష్ వారు నేర్పిన విధానమని చెప్పారు. మన దేశాన్ని, మనల్ని వారు విభజించి వెళ్లారని అన్నారు. ఏదైనా ముడి వేస్తే దానిని విప్పి ప్రారంభోత్సవ సూచికగా చూడాలన్నారు. మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయవాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వెంకట కృష్ణారావు జీవిత విశేషాలతో మల్లిఖార్జునరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని వెంకయ్య నాయుడు చెప్పారు. మహనీయుల జీవితాల్లో జరిగిన ముఖ్య ఘట్టాలను ఇటువంటి పుస్తకాల ద్వారానే నేటి తరం తెలుసుకోవాలని అన్నారు. వెంకట కృష్ణారావు నిగర్వి, నిరాడంబరుడిగా ఉంటూనే సేవలందించారని కొనియాడారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఆయన ఎంతో పరితపిస్తూ కృషి చేసేవారని తెలిపారు. వెంకట కృష్ణారావు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గురువులను గౌరవించేవారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఆచార్య రంగాని అవనిగడ్డకు ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ రాష్ట్రంలో రాజకీయ కార్యకర్తలకు పాఠశాలలు ఏర్పాటు చేసి ఆచార్య రంగా శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. పాత రోజుల్లో కమ్యూనిస్టులు, జనసంఘ్ కూడా ఇలాగే శిక్షణ ఇచ్చేవారని అన్నారు. నేటి రోజుల్లో రాజకీయ నేతలకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మమ్మీ, డాడీ' సంస్కృతి వదిలేసి 'అమ్మ, నాన్న' అని పిలిపించుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే ఇవ్వాలని, అది కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. అవసరమైన వారికి ఇంగ్లీష్‌లో అదనంగా కాపీలు ఇవ్వాలని సూచించారు. గతంలో ఇంగ్లీష్, ఉర్దూ వస్తేనే ఉద్యోగాలనే నిబంధన ఉండేదని.. ఇప్పుడు ఏపీ, తెలంగాణలో తెలుగు వస్తేనే ఉద్యోగాలనే నిబంధన అమలు చేయాలన్నారు. ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేస్తేనే మన భాషను పరిరక్షించుకోవడానికి వీలు ఉంటుందని పేర్కొన్నారు. సినిమాల్లోనూ అసందర్భంగానో, ప్రాసల కోసమో ఇంగ్లీష్ పదాలను ఉపయోగిస్తున్నారని అన్నారు. ప్రసార మాధ్యమాలూ తెలుగు భాష పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. ప్రజలు, ప్రభుత్వం, పత్రికలు కలిసి పనిచేస్తేనే తెలుగు భాషకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. నేడు అసెంబ్లీలో జరుగుతున్న రచ్చ, బూతులు చూస్తే ఆవేదన కలుగుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శాసనసభలో కొంతమంది మాట్లాడుతున్న తీరును మనం గమనిస్తున్నామని చెప్పారు. అందుకే ప్రజాప్రతినిధులకు కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మన మాతృభాషపై ప్రతి ఒక్కరూ మమకారం కలిగి ఉండాలని, పరభాషపై గౌరవం ఉండాలని అన్నారు. గుడిలో, బడిలో, అమ్మ ఒడిలో నుంచి వచ్చిన భాష తెలుగు అని పేర్కొన్నారు. విదేశాల్లోనూ చాలా మంది తెలుగు భాష పరిరక్షణ కోసం పాటుపడుతున్నారని తెలిపారు. మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించాలంటే భాషను రక్షించుకోవడం చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మన భాషను అలవాటు చేసుకోవాలని, మన పిల్లలకూ నేర్పించాలని సూచించారు. మాతృభాష మన కళ్లు అయితే, ఇంగ్లీష్ భాష కళ్లద్దాలు లాంటిదని అన్నారు.

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న యువతి పట్ల అసభ్య ప్రవర్తన

## అటెండర్ తీరుపై పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్,ఆగస్ట్4 :** నగరంలోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో దారుణం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వచ్చిన యువతిపై ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడం కలకలం రేపుతోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదంలో యువతికి రెండు కాళ్లు విరగడంతో ఆమెను కుటుంబసభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల మధ్యలో పక్క బెడ్‌లో ఉన్న మరో రోగి అటెండెంట్ యువతిపై అసభ్యంగా ప్రవర్తించాడు. వ్యక్తి తీరుతో యువతి తీవ్ర భయాందోళనకు గురైంది. వెంటనే జరిగిన విషయాన్ని యువతి మరుసటి రోజు తన కుటుంబసభ్యులకు తెలియజేసింది. ఈ విషయం పై యువతి తండ్రి, ఆర్ఎంపీ వైద్యుడు.. పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి వివరాలను సేకరించే పనిలో ఉన్నారు.

# కాళోజీ వర్సిటీలో కన్వీనర్ కోటా మెడికల్ సీట్లు

## వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు నేడు అవకాశం

**వరంగల్,ఆగస్ట్4 :** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు చర్యలు

## జాగిలంతో పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు

**రాజన్న సిరిసల్ల,ఆగస్ట్4 :** రాజన్న సిరిసల్ల జిల్లాలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు నిర్వహిస్తున్నట్లు నార్కోటిక్ పోలీసులు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలు కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాల్లో నార్కోటిక్ జాగిలంతో మంగళవారం తనిఖీ చేశారు. డ్రగ్స్, గంజాయి క్రయ, విక్రయాలపై పోలీసులకు వివరాలు తెలపాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ దెబ్బతింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామా లపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# తమిళనాట రాజకీయ రచ్చ..

## త్రిషపై పరోక్ష విమర్శలు

### ఉదయనిధి అరెస్ట్.. కోర్టు ఆదేశాలతో విడుదల



**చెన్నై,ఆగస్ట్4 :** తమిళనాడులో సీఎం విజయ్, సినీ నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో అరెస్టయిన ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు విడుదల చేశారు. పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సుమారు గంటన్నరపాటు విచారించిన అనంతరం విడుదల చేశారు. కావేరి జలాల అంశంపై జరిగిన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించి నవిగా విమర్శలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను చెన్నైలోని నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను సవాల్ చేస్తూ డీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం ఉదయనిధిని విడుదల చేయాలని, తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. కావేరీ జలాల అంశం ప్రస్తుతం తమిళనాడులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో తంజావూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉదయనిధిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కావేరీ నదీ జలాల అంశంపై సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డెల్టా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉదయనిధి పరోక్షంగా నటి ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఇవి అసహ్యమైన వ్యాఖ్యలు. ఎవరిపైనా ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. డీఎంకే దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలకు ఈ మాటలు నిదర్శనం' అని టీవీకే నేతలు మండిపడ్డారు. భాజపా నేతలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. ఇది సిగ్గుచేటు ప్రవర్తన అని తప్పుపట్టారు. ఉదయనిధి తీరుపై టీవీకే పార్టీ.. జాతీయ మహిళా కమిషన్‌ను ఫిర్యాదు చేసింది. ఆయన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని, చర్యలు చేపట్టాలని కోరింది. అలాగే ఉదయనిధి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

# విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

- బోధన అభ్యసన పద్ధతులు మెరుగు పడాలి
- ఆటపాటలతో పాటు ఆరోగ్య పరిరక్షణ కూడా ముఖ్యం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఈఓ వాసంతి

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్4 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచుతూనే బోధన అభ్యసన పద్ధతులు మెరుగుపర్చాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఈఓ వి.వాసంతి అన్నారు. చదువుతో పాటు ఆటల పట్ల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, చదువు, క్రీడలతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకునేందుకు పాఠ్యాంశంలో ప్రశ్నలు వేస్తూ వారి నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు అభ్యసన పద్ధతులను మెరుగుపర్చి విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చారా, ఇచ్చిన పుస్తకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారా అని అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు ఆటల పట్ల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, అంతేకాకుండా చదువు, క్రీడలతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పీడీ విద్యాసాగర్‌కు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ 3వ తరగతి విద్యార్థులతో అభ్యసన చేయించారు. ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పాలని వారిని అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మరింత పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యదుసింహరాజు, ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ, పీడీ విద్యాసాగర్, పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై దశలవారి పోరాటం

- 7న నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసనలు
- 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు
- ఉపాధ్యాయ సంఘాల జెఎసి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహించాలని యూఎస్‌పీసీ నిర్ణయించింది. ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, పీఆర్‌సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండం, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యా రంగానికి 15శాతం నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీ కే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఈవో, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను స్జబెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (ఆం), పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ప్రతినెలా రూ. 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలుకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చావ రవి, ఏ వెంకట్(టీఎస్ యూటీఎఫ్), సీహెచ్ అనీల్ కుమార్, ఎన్ తిరుపతి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టీ లింగారెడ్డి(డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టీఎఫ్), ఎస్ హరికిషన్ (టీటీఏ), బీ కొండయ్య (ఎంఎస్‌టీఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ, ఎస్టీ యూఎస్) పాల్గొన్నారు.

# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

## మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు



**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తు న్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# కాళేశ్వరం ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోంది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తూ తెలంగాణ రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా, ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న తెలంగాణ రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ఆరోపణలు తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.

# ఇ20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

## రాజ్యసభలో కేంద్రమంత్రి స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 :** దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఇ20 పెట్రోల్ పాలసీ అమలుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 ఇంధన వినియోగం, పాత వాహనాల భద్రత, దీని వల్ల చేకూరే ప్రయోజనాలను కేంద్రం సమగ్రంగా వివరించింది. దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ పాలసీ ద్వారా ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దీని ప్రధాన లక్ష్యమని చెప్పింది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతుందని వెల్లడించింది. ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంది.

# సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకం

## గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్,ఆగస్ట్4 :** సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకమని రాష్ట్ర గవర్నర్, తెలంగాణ యూనివర్సిటీల చాన్సలర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజభవన్‌లో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో గవర్నర్ ' అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమావేశం, నషా ముక్తే యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ సోసైటీ తదితర అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం, పేర్ల నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యను సమీక్ష చేసి మాట్లాడారు. యూనివర్సిటీలు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు తమ సేవలను విస్తరించాలని సూచించారు. దేశంలో ఉన్న మానవ వనరుల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే యువతకు విజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజీయూ వీసీతోపాటు పలువురు వీసీలు మొదటి తరం విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, హెచ్ఐవీ నివారణ, రక్తదానం, జీవన నైపుణ్యాల పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయ ప్రస్తావించారు. దీనిలో భాగంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ఏఎస్ఆర్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వం, పౌర సమాజంతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ రాజ్ భవన్ తో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో వీసీలు నిర్ణయించారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలను వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వివరించారు. దీనిలో భాగంగా ఉన్నత విద్యా రంగానికి విశేష సేవలు అందిస్తున్న సీనియర్ వైస్ చాన్సలర్లలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు ఘనంగా సన్మానించి అభినందించారు.

# బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం!




**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పకోవాలి. ఎందుకంటే అధికారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది.**

తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియం తృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది.

విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం.

గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సిన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బిజెపి మనుగడ కొనసాగుతుంది.

# ప్రశాంత్ కిశోర్ విజయంతో మారనున్న సమీకరణాలు

### బిజెపి సహా అన్ని పార్టీలకు ఇక ముప్పే

**పాట్నా, ఆగస్ట్ 4 :** బీహార్‌లో బిజెపి తీరును ప్రజలు వ్యతిరేకిసక్తున్నారనడానికి బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితమే నిదర్శనమని చెప్పాలి. బిజెపి కంచుకోటను వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బద్దలు కొట్టారు. నిజానికి అక్కడ ప్రజలు బిజెపి పట్లా అదే విధేయతను ప్రకటించడం లేదని తేలింది. బాంకీపూర్‌ను నిలబెట్టుకోవడం కోసం బీజేపీ అన్ని అడ్డదారులూ తొక్కిందని, పోలీసు ఉన్నతాధికారులు దానికి ఏజెంట్లుగా పనిచేశారని, తన పార్టీ కార్యకర్తలను జైళ్ళలో కుక్కారని ప్రశాంత్ కిశోర్ పెద్ద పెద్ద ఆరోపణలు చేశారు. అయినా బిజెపి గెలవలేక పోయిందని విమర్శించారు. ఐదేళ్ళ క్రితం ఎన్నికల వ్యూహకర్త పాత్రకు స్వస్తిచెప్పి, రెండేళ్ళపాటు బిహార్ అంతా కాలినడకన కలయదిరిగి, ఒక ఆదర్శవంతమైన మేనిఫెస్టోతో ఆయన రాజకీయ రంగప్రవేశం చేశాడు. తాను ఎన్నికల్లో నిలబడకుండా, ఓ ఐదు అసెంబ్లీ స్థానాలు మినహా అన్నింటిలోనూ తన పార్టీ అభ్యర్థులను నిలబెట్టాడు. ఓ మూడున్నర శాతం ఓటువాటా దక్కింది కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవలేదు. ఆ ఘోర పరాజయం నుంచి ఏడాది తిరిగేసరికి ఇప్పుడు దక్కిన విజయం ఆయనకు పెద్ద ఉపశమనం. తాను



ఇప్పుడు ఓడినా పోయేదేమీ లేదని, ఒకవేళ నెగ్గితే, ఏకంగా బీజేపీ అధ్యక్షుడి కుటుంబాన్ని ఢీకొని, కంచుకోటను స్వాధీనం చేసుకున్న ఘనత దక్కుతుందని పీకే అనుకొనివుంటారు. ఒక ఎమ్మెల్యే సీటు కంటే, దేశంలో కొద్దినెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం ఓటర్లమీద ఏ స్థాయిలో ఉన్నదో, బిహార్ ఓటర్లు ప్రత్యామ్నాయం గురించి చూస్తున్నదీ లేనిదీ తేల్చుకోవాలనుకొని ఉంటారు. అగ్రకులాలతో పాటు, యాదవులు, ముస్లింలు, దళితులు, ఎంబీసీ, ఈబీసీ ఓటర్లు సైతం ప్రశాంత్‌కిశోర్‌కు ఓటుచేయడం వల్లనే 20వేల మెజారిటీ సాధ్యపడిందని విశ్లేషకుల అభిప్రాయం. సర్వసాధారణంగా ఉపఎన్నికల్లో అధికారపార్టీయే విజయాలు సాధిస్తుంది. కానీ, బిహార్ పరిస్థితి వేరు. శాసనసభ ఎన్నికల పోరుకు సారథ్యం వహించి, కూటమిని గెలిపించి, అనేక నాటకీయ పరిణామాల మధ్య అనతికాలంలోనే నితీశ్‌కుమార్ తప్పుకున్నారు. అనూహ్యంగా తెరమీదకు వచ్చిన తొలి బీజేపీ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మీద రాష్ట్ర ప్రజల తొలి తీర్పు ఇది అని పీకే పార్టీ ఆరోపిస్తోంది. బిహార్‌తో పాటు, తన ఏలుబడిలో ఉన్న మధ్యప్రదేశ్‌లోనూ మరో స్థానాన్ని కోల్పోయిన బీజేపీకి, మోదీ స్వరాష్ట్రం గుజరాత్ ఒక్కటే ఉపశమనాన్ని ఇచ్చింది. ఇదంతా ఒక్ ఎత్తయితే బీహార్‌లో ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రస్థానానికి పునాది పడిందని చెప్పుకోవాలి. ఈ ఒక్కసీటుతో పికె ఇక దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. బిజెపి, ఆర్జెడి, నితీశ్ పార్టీలో ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మలచుకునే సత్తా పికెకు ఉంది. రానున్న రోజుల్లో అక్కడ పికె ప్రభావం పెరిగినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.

# చర్చలకు రాకుండా మోసపూరిత వ్యవహారం


### ఇరాన్‌కు మరోమారు ట్రంప్ అల్టిమేటం

### ఇరాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయాలపై గురి

**వాషింగ్టన్, ఆగస్ట్ 4 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నాయకత్వానికి అల్టిమేటం ఇచ్చారు. అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని.. అలాకాకపోతే పూర్తిగా లొంగిపోవాలని తేల్చి చెప్పారు. సోమవారం తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ది ట్రూత్ సోషల్‌లో ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ మోసపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇరాన్ చర్చల కోసం తమను ప్రాధేయపడిందని, ఇప్పుడు బహిరంగంగా చర్చలు కుదరవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ దీన్ని అంగీకరించినా.. అంగీకరించకపోయినా.. దశాబ్దాలుగా వాళ్లు సృష్టించిన ఓ సమస్యకు పరిష్కారం గురించి మేము మాట్లాడుతున్నాం. హోర్ముజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ నాయకత్వం ఎప్పటిలాగే వ్యర్థమైన మాటలు చెబుతోంది. కానీ, హోర్ముజ్ జలసంధి ఇప్పటికే అమెరికా నియంత్రణలో ఉంది. హోర్ముజ్ 'ది యునైటెడ్ స్టేట్స్ వాల్ ఆఫ్ స్టీల్' కంట్రోల్‌లో ఉంది. జలసంధిలో ప్రయాణం పూర్తిగా అమెరికా ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి ఉంటుంది. ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు' అని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడం కోసం అమెరికా పెట్టిన షరతులను ఇరాన్ అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌ను టార్గెట్ చేసేందుకు కొత్త మార్గాలు వెతకాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, దాని అణు కార్యక్రమాలను నిలిపివేసేలా చేయడం కోసం వినూత్న, సంప్రదాయేతర సూచనలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు టెహ్రాన్‌పై దాడులకు వాషింగ్టన్ అమలు చేసిన వ్యూహాన్ని సెంట్రల్ కమాండ్ అధికారులు పునఃపరిశీలిస్తున్నారని సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే.



అయితే, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ జోక్యంతో భీకర దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గారు. కాగా.. అధ్యక్షుడి హెచ్చరికల కంటే ముందే అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను తిరిగి చర్చలకు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా కొన్ని వారాలుగా నిరంతర వైమానిక దాడులు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఒప్పందం కుదిరే సూచనలు కనిపించకపోవడంతో.. టెహ్రాన్‌ను శిక్షించడంపై అగ్రరాజ్యం ఇప్పుడు దృష్టి సారించినట్లు సమాచారం.ఒప్పందంపై తుది నిర్ణయానికి రావడానికి ఇరాన్‌కు 'చివరి అవకాశం' ఇచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చేపట్టిన దాడులకంటే తీవ్రంగా ఇరాన్‌పై విరుచుకు పడడానికి తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ యుద్ధం ముగింపునకు దౌత్య మార్గాలు అనుసరించాలని ఇరాన్‌తో సహా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ చేసిన అభ్యర్థనల మేరకు సైనిక దాడిని నిలిపివేశామన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని వారు వినియోగించుకోకపోతే ఇక టెహ్రాన్‌ను వదిలే సమస్యే లేదన్నారు. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున కువైట్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్‌జీసీ డ్రోన్ దాడులు చేపట్టింది.




# మరో బాదుడుకు సిద్ధం అవుతున్న ట్రంప్

### హెచ్-1బీ, ఎల్-1

### పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు

**వాషింగ్టన్, ఆగస్ట్ 4 :** వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది. ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబంధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదారులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్ కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్స్ విషయంలోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమత్లో అధిక శాతం రెన్యువల్స్‌కు సంబంధించినవే. 2025 సెప్టెంబర్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 4.06 లక్షల హెచ్-1బీ అప్లికేషన్లను ఆమోదించగా వాటిల్లో 71 శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవేనని తేలింది. కాబట్టి ఈ ఫీజు కూడా అమల్లోకి వస్తే భారతీయులపై మరింత భారం పెరిగే అవకాశం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.




# ట్రంప్ సుంకాల నిర్ణయాలపై చిక్కులు

### న్యాయస్థానాల్లో సవాల్ చేసిన 25 రాష్ట్రాలు

**వాషింగ్టన్, ఆగస్ట్ 4 :** సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో సహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారుచేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అమలు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలు ఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకుముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్‌లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది. ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో ఈ పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యూఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు

# పార్లమెంట్‌లో ముఖం చాటేస్తున్న మోడీ

### కాంగ్రెస్ ఎంపి మల్లు రవి తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 :** అయోధ్య రామమందిరం విరాళాల చోరీపై సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటన చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. అయోధ్య రామ మందిరానికి భక్తులు ఇచ్చిన విరాళాలు దుర్వినియోగమయ్యాయని తెలిపారు. వీటిపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మంగళవారం ఢిల్లీలో మల్లు రవి మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై చర్చించే వేదిక పార్లమెంట్ అని చెప్పుకొచ్చారు. ఒక్కరోజు కూడా పార్లమెంట్ పని చేయకుండా వాయిదాలు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్ మోదీ ప్రభుత్వానికి ఒక ఆటస్థలంగా మారిందని ధ్వజమెత్తారు. సభలో ఏ మాత్రం చర్చలేకుండా బిల్లులు ఆమోదించుకుంటున్నారని మల్లు రవి ఆగ్రహించారు. పార్లమెంట్ నడవక పోగా వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు రాజీనామా చేసిన నియోజకవర్గంలో కమలం పార్టీ అభ్యర్థి ఓడిపోయారని ఎద్దేవా చేశారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించక పోవడంతోనే బీజేపీకి వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే బీజేపీ ఒక చోట మాత్రమే గెలిచిందని మల్లు రవి అన్నారు. బీజేపీ త్వరలో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పె÷-లలెట్ గన్స్ ప్రయోగించారని మండిపడ్డారు. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని మల్లు రవి డిమాండ్ చేశారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

### 12మంది ప్రయాణికులకు గాయాలు

**ఏలూరు, ఆగస్ట్ 4 :** ఉంగుటూరు మండలం తేలప్రోలు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి విశాఖపట్నం వైపు సుమారు 25 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తేలప్రోలు సమీపానికి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమారు 12 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్సులో సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు వెనుక నుంచి వస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని కూడా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆయిల్ ట్యాంకర్‌లో సుమారు 400 లీటర్ల డీజిల్ ఉంది. ఈ డీజిల్ ట్యాంక్‌కి షార్ట్ సర్క్యూట్ అయ్యి ఉంటే ప్రమాద స్థాయి తీవ్రంగా ఉండేది. సమాచారం అందుకున్న గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర, హనుమాన్ జంక్షన్, ఆత్కూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



## విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం : కాంతారావు

**వినూత్న నిరసనకు దిగిన బిజెపి యువజన నాయకులు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 4, (జనం వార్త) :** తెలంగాణలో గతంలోబిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తులతో చెలగాటం ఆడుతున్నాయని కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం బిజెపి యువజన విభాగం నాయకులు ఆధ్వర్యంలో ఫీజుబకాయి బిజెపి లాడాయి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. భరత్ నగర్ మార్కెట్‌లో బిజెపి యువజన నాయకులు కూలీలుగా మారి బస్తాలు మోసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కష్టంతో సంపాదించిన డబ్బును నిరసనలో భాగంగా ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి మనీ ఆర్డర్ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో ఉంచడం అత్యంత సిగ్గుచేటని,ఇది పూర్తి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా, కళాశాల యాజమాన్యాల వద్ద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని బిజెపి నాయకులు కార్యకర్తలు బీజేపీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం తగదు : బండి రమేష్

**అధికారుల సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 04, (జనం వార్త) :** సమస్యలను పరిష్కరించడంలో అధికారుల సమన్వయ లోపంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనిహెచ్‌పిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ పరిధి అల్లాపూర్ డివిజన్ లో మంగళవారం బండి రమేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం పాదయాత్ర చేసినప్పుడు గుర్తించిన సమస్యలే ఇప్పటికీ అలానే ఉన్నాయని, సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ లో రోడ్లు అధ్వాన్నంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని ఈ బ్లాక్ లో రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. సిఎంసి, వాటర్ వర్క్స్ అధికారుల సమన్వయ లోపంతోనే పనులు నిలిచిపోయాయన్నారు. మంజీరా పైప్ లైన్ వర్క్స్ సాకుగా చూపి రోడ్డు పనులను నిలిపివేయడం సరికాదన్నారు. వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకొని రోడ్ల సమస్యను పరిష్కరించాలని సిఎంసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాజిద్ పాషా, లక్ష్మణ్ గౌడ్, అబ్దుల్లా, సాయితులసి,రేష్మ, లక్ష్మి,రాము,రాంబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ జలాల సంరక్షణకై ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

**దుబ్బాక ప్రతినిధి ఆసరాజు ఆగస్టు 4 (జనం వార్త) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు, ఈగల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు మరింత అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక పురపాలక కమిషనర్ ఏ. మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని రహదారుల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని సిబ్బందితో తొలగింపజేశారు. వార్డులోని బీసీ బాలికల వసతిగృహంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్, రసాయనాలను చెల్లించారు తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం వార్డులో క్యాచ్ ది రెయిన్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఇళ్ళ నిర్మాణం చేపట్టే వారికి ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ సోనీ, కాంగ్రెస్ నాయకులు అనంతల శ్రీనివాస్, శ్రీరామ్ నరేందర్, మట్ట కిషన్ రెడ్డి, పురపాలక సిబ్బంది అంగన్వాడీ, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణం

- ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- మేడ్చల్ జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి : సిద్ధార్థ

**మేడ్చల్ :** తెలంగాణ గృహ నిర్మాణ మండలి మేడ్చల్ జిల్లాలో నాలుగు చోట్ల ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ను ( జీ ప్లస్ టెన్ పద్ధతిలో ) నిర్మించ తలపెట్టిందని, ఈ టవర్స్ లో ఇండ్లు కావాలనుకునే వారు ఈ నెల 10వ తారీకు లోగా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ అధికారి సిద్ధార్థ తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, మేడ్చల్ మల్కాజిరి జిల్లా పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారం (ఎస్ఐసి కాలనీ), మల్కాజిరి నియోజకవర్గంలోని కౌకూరు, కుత్బుల్లా పూర్ లోని గాజులరామారం అలాగే, కూకట్ పల్లి లోని కె. పి. హెచ్. బి కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల టవర్లు జి ప్లస్ టెన్ పద్ధతిలో నిర్మించ తలపెట్టిందని ఆయన వెల్లడించారు. ఆసక్తి గలవారు ఈ నెల 10లోగా రూ.100లు దరఖాస్తు రుసుము, ధారావత్ సొమ్ముగా పది వేల రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, శారీరక వికలాంగులు, ప్రభుత్వ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు రిజర్వేషన్ ఉందన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం 5 లక్షల రూపాయలు చెల్లించనుండగా లబ్ధిదారుడు తన వాటా కింద ఆరు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందనీ, సమీప మీసేవ కేంద్రములలో లేదా ఈ వాట్సప్ నెంబర్: 8096958096 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సిద్ధార్థ సూచించారు.

## దుబ్బాకలో మాస్టర్ మైండ్ స్కూల్లో ఘనంగా బోనాలు ఉత్సవాలు



**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 4 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు బోనాలు, పోతరాజు వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మరిన్ని వివరాలు మా ప్రతినిధి అందిస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఆషాఢ మాసం సందర్భంగా పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపు లో పాల్గొన్నారు. పోతరాజు వేషధారణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలను చిన్నారులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రోళ్ల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వై.వి. రావు, బిట్ల యాదగిరి, దువ్వాల శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## సిద్దిపేటలో రోడ్డుపై నాట్లు వేసి బిఆర్ఎస్ నేతల వినూత్న నిరసన



**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 4 (జనం వార్త) :** అనునిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డుపై గుంతలు పడడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని.. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కానీ, అధికారుల్లో గానీ చలనం లేదని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధి 16 వ వార్డులో భారీమాం చౌరస్తా నుండి ఎల్లమ్మ గుడికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా గుంతల మాయమై నీరు నిలవడంతో బిఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై నిలిచిన నీటి గుంతలలో వరి నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట ఎల్లమ్మ గుడి నుండి భారీమామ్ చౌరస్తా వరకు రోడ్డు పరిస్థితి దుర్భరంగా మారిపోయింది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరొక వారం రోజుల్లోగా రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజనర్సు హెచ్చరించారు.

## స్కాలర్‌షిప్ బకాయిలపై కదం తొక్కిన విద్యార్థులు

**మిర్యాలగూడలో 1,500 మందితో ఎస్ఎఫ్ఐ భారీ ప్రదర్శన**



**మిర్యాలగూడ, ఆగస్టు 4:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ స్పష్టం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాఘవ టాకీస్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సుమారు 1,500 మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని కారణంగా చూపుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆసరాగా ఉండే నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బకాయిల కారణంగా కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వారి ఉన్నత విద్యకు ఆటంకం కలుగుతోందని, కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 6న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటించి పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు మూడవత్ రవి నాయక్, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మూడవత్ జగన్ నాయక్, కుర్ర సైదా నాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్‌తో పాటు లోహి, ఝాన్సీ, బన్ని, హనుమంతు, పవన్, బిస్మిల్లా, తరుణ్, కల్పన, రాధిక, కళ్యాణి, స్పందన, శిరీష, కావ్య, అంజలి, మానస తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల బియ్యం.. ఒక్కరితోనే పంపిణీ!

- రేషన్ షాపులకు పోటెత్తిన లబ్ధిదారులు
- సహనంతో సేవలందిస్తున్న డీలర్లు



**మిర్యాలగూడ, ఆగస్టు 4:** మూడు నెలల కోటా ఒకేసారి.. తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు.. పంపిణీ చేసేందుకు మాత్రం డీలర్ ఒక్కరే..! మిర్యాలగూడలోని రేషన్ దుకాణాల వద్ద మంగళవారం కనిపించిన పరిస్థితి ఇది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి అందిస్తుండటంతో ఉదయం నుంచే కార్డుదారులు షాపులకు తరలివచ్చారు. దీంతో పలుచోట్ల బారులు తీరి దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. కార్డుదారుల వివరాల పరిశీలన, తూకం, బియ్యం అందజేత వరకు అన్ని పనులను ఒక్కరే నిర్వహిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి మూడు నెలల సరుకు తూకం వేయాల్సి ఉండటంతో పంపిణీ వేగం తగ్గి క్యూలు కొనసాగుతున్నాయి. మహిళలు, వృద్ధులు సహా పలువురు తమ వంతు కోసం చాలాసేపు నిరీక్షిస్తున్నారు. ఎక్కువ పరిమాణంలో బియ్యం తీసుకెళ్లాల్సి రావడంతో పలువురు పెద్ద సంచులతో షాపులకు చేరుకుంటున్నారు. లబ్ధిదారుల తాకిడి డీలర్లకు సైతం పరీక్షగా మారింది. వరుసగా వచ్చే కార్డుదారులకు కోటా అందిస్తూ, లెక్కల్లో పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. త్వరగా బియ్యం తీసుకెళ్లాలనే ప్రజల ఆతృత మధ్య కూడా సహనం కోల్పోకుండా ఒక్కొక్కరికి సేవలందిస్తున్న తీరు కనిపిస్తోంది. ప్రత్యేక పంపిణీ నేపథ్యంలో రద్దీ అధికంగా ఉండే దుకాణాల వద్ద సహాయక సిబ్బందిని ఏర్పాటు చేస్తే ప్రక్రియ వేగవంతమవుతుంది. తద్వారా కార్డుదారుల నిరీక్షణ తగ్గడంతో పాటు డీలర్లపై పని భారం కూడా తగ్గుతుంది. మూడు నెలల సరుకు చేతికందుతున్నా దానికోసం రేషన్ షాపుల వద్ద మాత్రం నిరీక్షణ తప్పడం లేదు.



## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

**బస్ భవన్ ముట్టడిలో అక్రమ అరెస్టులపై నేతల ఆగ్రహం**

**వనపర్తి, ఆగస్టు 4:** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన రూ.900 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బస్ భవన్ ముట్టడికి పిలుపునిస్తే వయోవృద్ధులని కూడా చూడకుండా అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వాకిటి శ్రీధర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సత్యం, కౌన్సిలర్ భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017 నుంచి రావాల్సిన ఆర్‌బీఎస్, గ్రాట్యుటీ, పెన్షన్ బకాయిలు ఒక్కొక్కరికి 15 నుంచి 20 లక్షల వరకు ఉన్నాయని, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం దాచుకున్న సొమ్మును ప్రభుత్వం చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. విశ్రాంత ఉద్యోగులను విస్మరిస్తే ప్రభుత్వానికి విశ్రాంతి ఇస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తమకు అండగా నిలిచి సమస్యలు పరిష్కరించారని, నూతన విశ్రాంత భవనం నిర్మించారని గుర్తు చేశారు. అరెస్టు సమయంలో మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి తమకు మద్దతుగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, అంజయ్య, ఉపేందర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్
- మల్కాపూర్‌లో రీసర్వే పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- బియ్యం మిల్లులు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**వనపర్తి, ఆగస్టు 4:** భూభారతి రీసర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో పర్యటించిన ఆయన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సరిహద్దుల నమోదు, డిజిటల్ మ్యాపింగ్ పనులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, భూసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రెండు బియ్యం మిల్లులను సందర్శించిన వినోద్‌కుమార్ ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మిల్లింగ్ వేగవంతం చేయడంతో పాటు బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని మిల్లుల నిర్వాహకులకు సూచించారు. తదుపరి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పోషకాహార సేవలను పరిశీలించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన బోధన, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.



## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి రూ.3.87 లక్షల బీమా చెక్కు అందజేత

**రాజాపూర్ ప్రతినిధి, ఆగస్టు 4:** రాజాపూర్ మండల కేంద్రంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన పాలసీదారుడు చాకలి వెంకటయ్య కుటుంబానికి రూ.3.87 లక్షల బీమా చెక్కును మంగళవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే, చాకలి వెంకటయ్య శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ కమ్మరి సతీష్ ద్వారా రూ.21,803 ప్రీమియంతో జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. అనంతరం ప్రమాదవశాత్తు ఆయన మృతి చెందడంతో పాలసీ నిబంధనల ప్రకారం రూ.3,87,000 బీమా మొత్తాన్ని ఆయన భార్య నరసమ్మకు గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం సతీష్ చందా మాట్లాడుతూ, జీవిత బీమా అనేది కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించే రక్షణ కవచమని అన్నారు. ప్రతి కుటుంబం తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జీవిత బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేష్మా నజీమ్ బేగ్, రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనెల రమేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రాచమల్ల యాదగిరి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, అచ్చయ్య, ఖానాపూర్ సర్పంచ్ శేఖర్, విక్రమ్ రెడ్డి, వార్డు సభ్యులు యాదగిరి, సలీం, లింగం, షాద్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బంది, డెవలప్‌మెంట్ అధికారులు, సేల్స్ అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నల్లచెరువు బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు

**రంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 4 :** ఎలివేటెడ్ కారిడార్ రోడ్ల నిర్మాణం సందర్భంగా ఉప్పల్ బస్టాండ్ ను నల్లచెరువు వరకు మార్చిన నేపథ్యంలో సోమవారం నాడు వరంగల్ డిపోకు చెందిన బస్సు నల్లచెరువు బస్ స్టాప్ లో బురదలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో పోలీసులు క్రేన్ సహాయంతో బస్సులు బయటకు తీసి డిపోకు పంపించారు. ఈ సందర్భంగా బస్టాండ్లో మూత్రశాలలు మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని సంచార వాహనం వచ్చిన అది పరిశుభ్రంగా ఉండడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.



## వాషింగ్టన్‌లో విస్తరిస్తున్న కార్చిచ్చు

**అత్యవసర పరిస్థితి విధింపు**

**వాషింగ్టన్ :** అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించి వేస్తుండగా, సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60వేలమందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు. తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండడంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంటలు చెలరేగుతున్న ప్రాంతాల్లో డ్రోన్‌లు ఎగరవేయడంపై నిషేధం విధిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి చర్యలను చట్టవిరుద్ధంగా పరిగణిస్తామన్నారు. సహాయక చర్యలు కొనసాగిస్తున్న అగ్నిమాపక విమానాలు, హెలికాప్టర్లకు అవి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. డ్రోన్‌ల వల్ల ఆదివారం 26 సార్లు అగ్నిమాపక కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని తెలిపారు.

## అంబులెన్స్ సిబ్బంది దాష్టీకం

- మృతదేహాన్ని మార్గమధ్యలో అడ్డుకున్న వైనం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

**మంచిర్యాల, ఆగస్ట్ 4 :** కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వేళ.. మృతదేహం తరలింపుపై అంబులెన్స్ సిబ్బంది వ్యవహరించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇంటికి తీసుకెళ్తున్న మృతదేహాన్ని మార్గమధ్యలో అడ్డగించి, తిరిగి ఆస్పత్రికి తీసుకువచ్చి, తమ అంబులెన్స్‌లోనే వెళ్లాలని పట్టుబట్టడం చర్చనీయాంశమైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని పి.ఆర్. శంకరయ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెలగపూడి నాగభూషణం (65) సోమవారం రాత్రి సుమారు 10.30 గంటలకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికంగా తమకు తెలిసిన అంబులెన్స్‌లో ఆయనను పట్టణంలోని వసుధ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని అప్పగించడంతో కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా.. ఆస్పత్రి వద్ద ఉండే అంబులెన్స్ సిబ్బంది ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. మేం లైన్‌లో ఉన్నాం.. మా అంబులెన్స్‌లోనే డెడ్ బాడీని తీసుకెళ్లాలని తమతో వాగ్వాదానికి దిగారని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. అప్పటికే బయటకు వెళ్లిన తమ వాహనాన్ని బలవంతంగా తిరిగి ఆస్పత్రికి రప్పించారని.. అక్కడి నుంచి తమ అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఇక్కడ అంబులెన్స్ పాయింట్ మాది.. ఇక్కడ మేమే సీనియర్లం.. మేం చెప్పిందే నడవాలి. మా తర్వాతే మీరు అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. ఇటువంటి సున్నితమైన సమయంలో ఇలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వర్షంలో ప్రజలకు సేవలందించిన పోలీసులు

**నిజామాబాద్, ఆగస్ట్ 4 :** ప్రజాసేవే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాల సమయంలో ప్రజలకు సేవలందించిన ఆరో టౌన్ పోలీసు సిబ్బందిని సీపీ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారి పై భారీగా వరద నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో టౌన్-6 ఎస్ఐ కె సందీప్ ఆదేశాలతో ఏఎస్ఐ జక్రయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా హుటాహుటిన స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ను సమర్థవంతంగా నియంత్రించినట్లుగా సీపీ పేర్కొన్నారు. భారీ వర్షం నీరు కారణంగా డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వరద నీటి ప్రవాహం రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా దాన్ని గమనించిన పోలీస్ సిబ్బంది , సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి జేసీబీల సహాయంతో ఉదయం నుండి సాయంత్రం వరకు డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయించినట్లు చెప్పారు. దీంతో రహదారిపై రాకపోకలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యంత అంకితభావంతో విధులు నిర్వహించిన 6 టౌన్ పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శాలువాలతో ప్రత్యేకంగా సత్కరించి, అభినందిస్తూ ప్రశంసించారు. ఇదే సేవాస్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు అండగా నిలవాలని ఈ సందర్భంగా సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , ఆరవ టౌన్ ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## టీ కోసం వెళ్లొచ్చేసరికి ఇంట్లో దొంగతనం

**నిజామాబాద్,ఆగస్ట్4 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి అనంతరం తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని అర్ధరాత్రి సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మూడో టౌన్ ఎస్ఐ హరిబాబు కథనం ప్రకారం.. నిజాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన సాయి అనే వ్యక్తి సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి రైల్వే స్టేషన్ వద్ద టీ తాగేందుకు వెళ్లాడు. తిరిగి గంట తర్వాత ఒకటింటికి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరంగా ఉండడంతో రెండు గంటల సమయంలో తనకు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మూడు తులాల బంగారం దొంగతనం జరిగినట్లు బాధితుడు వెల్లడించాడు. ఘటనా స్థలాన్ని నగర సీఐ శ్రీనివాస్ రాజ్ పరిశీలించి క్లూస్ టీం తో ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఐ హరిబాబు వెల్లడించారు.

# చంద్రబాబుపై అక్కసుతో విషం చిమ్ముతున్న జగన్

**అమరావతిని జీర్ణించుకోలేకే విమర్శలు**
**మండిపడ్డ మంత్రులు అనగాని, సవిత,నారాయణ**
**అమరావతి పనులను పరిశీలించిన మంత్రులు**



**అమరావతి, ఆగస్ట్ 4 :** చంద్రబాబుపై ఉన్న అక్కసుతో జగన్ అమరావతిపై నాడు వైఎస్ జగన్ విషం చిమ్మారని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహించారు. అబద్దాల పునాదులపై అధికారంలోకి వచ్చాక అమరావతిపై జగన్ బురద జల్లారని ఫైర్ అయ్యారు. ముందు రాజధాని అమరావతికి ఒకే అన్నారని.. ఆ తర్వాత మూడు రాజధానులు, ఇప్పుడు మావిగాన్ అన్నారని ప్రస్తావించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం ఆయనకు ఇష్టం లేదని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతిలో మంత్రి అనగాని మీడియాతో మాట్లాడారు. తాము ప్రతిపక్షంలో ఉండగా రైతులతో కలిసి పాదయాత్ర చేశామని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో విధ్వంసం తర్వాత అమరావతిలో కట్టడాలు పటిష్ఠతపై తాము రిపోర్టు తీసుకొని రెండేళ్లలో పూర్తి చేశామని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణంలో ఉన్న భవనాలు అన్ని త్వరలోనే హ్యాండ్ ఓవర్ చేస్తామని మంత్రి అనగాని చెప్పుకొచ్చారు. డయాగ్రిడ్‌ను భారతదేశంలో తొలిసారిగా ఐకానిక్ బ్రిడ్జిలో వాడామని తెలిపారు. 2015లో భోగాపురం విమానాశ్రయం బేసిక్ డాక్యుమెంట్ తయారైందని అన్నారు. ఆ తర్వాత భోగాపురంపై జగన్ అడ్డుపుల్ల వేశారని దుయ్యబట్టారు. నాడు మహిళలు అని కూడా చూడకుండా అమరావతి రైతులను హింసించారని మండిపడ్డారు. మంత్రి నారా లోకేశ్ రిజైన్ చేయాలని వైసీపీ నేతలు అంటున్నారని.. ఆయన ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. తల్లికి వందనం, మెగా డీఎస్సీ, మెగా పీటీఎం పెట్టినందుకా లోకేశ్ రాజీనామా చేయాలని నిలదీశారు. ఆ పార్టీలో సైకిక్ ప్రాబ్లం ఉన్న నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. స్టాన్‌ఫర్డ్ పేరు పలికే అర్హత కూడా గొడ్డలి పార్టీ నేతలకు లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. రాజధాని అమరావతిని పూర్తి చేస్తామని చెప్పి జగన్ అధికారంలోకి వచ్చాక రైతులను ఇబ్బంది పెట్టారని ఏపీ మంత్రి సవిత ఆగ్రహించారు. మంగళవారం అమరావతి నిర్మాణాలను సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. 30 వేల మంది కార్మికులతో అమరావతిలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా పనులు జరుగుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జి బంగ్లా, మంత్రుల బంగ్లాలు ఇలా అన్ని రెడీ అవుతున్నాయని చెప్పుకొచ్చారు. మూడు రాజధానులు అని జగన్ చెప్పి ప్రజలను మభ్యపెట్టరని విమర్శించారు. ఇప్పుడేమో డైవర్షన్ పాలిటిక్స్‌కు వైసీపీ నేతలు దిగుతున్నారని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్రలో ఎయిర్‌పోర్ట్ ప్రారంభం పై కూడా గొడ్డలి పార్టీ నేతలు విషం చిమ్మారని మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులను మంత్రులు అనిగాని సత్యప్రసాద్ నారాయణ, సవితలు కలిసి మపరిశీలించడం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో అమరావతి నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోంది. మొదటి దశ నిర్మాణ పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు తెలిపారు. ప్రస్తుతం 30 వేల మందికిపైగా కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన 210 మీటర్ల సచివాలయ భవనం, ఒకేచోట సచివాలయం, హెచ్ఓడీ టవర్లు, ప్రజలకు సమగ్ర సేవలు అందించే పరిపాలనా కేంద్రంగా అమరావతి రూపుదిద్దుకుంటోందన్నారు.

నెలపాడులోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్ల నిర్మాణం పూర్తికాగా, ఆగస్టు 15న ప్రజాప్రతినిధులకు వాటిని అందజేయనున్నారు. అలాగే సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీతో పాటు అన్ని ఐకానిక్ భవనాల నిర్మాణాన్ని 2028 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది. చంద్రబా బు నాయుడు, మంత్రి నారాయణ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు, కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతోందని సవిత తెలిపారు.

## ప్రజలకు తెలిసేలా రాష్ట్ర సమగ్ర సమాచారం

- వైసీపీ అధికారంలో ఉండగా 10.3 శాతం వృద్ధి
- ప్రస్తుతం 11.3శాతం వృద్ధి సాధించాం
- సమాజంలో మార్పు కోసమే పీ4 కార్యక్రమం
- బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం
- కూటమి ప్రభుత్వ సమర్థతకు భోగాపురం నిదర్శనం
- మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు
- పెట్టుబడుల ఆకర్షణకు 28 నూతన పారిశ్రామిక పాలసీలు
- 23 లక్షల కోట్ల ఎంవోయూలు కుదుర్చుకున్నాం
- ఆర్థికస్థితిపై మరో శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు



**అమరావతి,ఆగస్ట్4 :** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సంపద పెరిగితేనే ఉపాధి పెరుగుతుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 10.3 శాతం మాత్రమే వృద్ధి సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం 11.3శాతం వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. పీ4 వల్ల 2.4లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. అందుకే.. మార్గదర్శి- బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చానని చంద్రబాబు వివరించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నా.. ఇదొక చారిత్రక అంశం. ఇప్పటి వరకు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేది. విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరాం. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గింది. వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనం అన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని అన్నారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశాం. రెండు తెలుగు రాష్ట్రాలు కూడా నేనే అభివృద్ధి చేశా. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశాం. పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనార్టీలకు పెద్ద ఎత్తున సంక్షేమ ర్యక్రమాలు అమలు చేస్తున్నాం. కేంద్రం నుంచి వచ్చే నిధులతోనూ పథకాలు కొనసాగిస్తున్నాం. రైల్వే, రహదారుల కోసం కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించుకుంటున్నాయి. పెట్టుబడుల ఆకర్షణకు 28 నూతన పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చా. 23 లక్షల కోట్ల ఎంవోయూలు చేసుకున్నాం. దేశంలోనే పీపీపీ ప్రాజెక్టుల అమలులో ఏపీదే అగ్రస్థానం. ప్రజలకు అందుతున్న సేవలపై ప్రజాభిప్రాయం తీసుకుంటున్నాం. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నాం. ఏఐని ఉపయోగించి మెరుగైన సేవలందించే పని పెద్ద ఎత్తున చేస్తున్నాం. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదు. కష్టపడి పనిచేస్తే ఫలితం పదిరెట్లు ఉంటుందని సీఎం వివరించారు. 2024లో ఎవరూ ఊహించని విజయం సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రజెంటేషన్ బాధ్యత గల ప్రభుత్వం ఇచ్చే నివేదిక అని చెప్పుకొచ్చారు. సమర్థవంతంగా ప్రభుత్వాలు పనిచేసి.. గవర్నెన్స్ బాగుంటే ప్రజలపై ప్రభావం ఉంటుందన్నారు. 2024లో ఒక సైలెంట్ రివల్యూషన్ ప్రజల్లో వచ్చిందన్నారు. 1982, 1994, తాజాగా 2024లో ఇలాంటి ఫలితాలు చూశామన్నారు. 2024లో 94శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని... అది ఊహించని విప్లవమని తెలిపారు. రాష్ట్రవిభజన తరువాత ఏపీ వ్యవసాయాధారిత రాష్ట్రంగా అయిపోయిందని.. 58 శాతం ప్రజలకు 46 శాతం మాత్రమే వనరులు దక్కాయన్నారు. రెండు రాష్ట్రాలను ఉమ్మడిగా అభివృద్ధి చేశామని చెప్పారు. జగన్ హయాంలో ఏపీలో విధ్వంసం జరిగిందని.. దీనివల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం విమర్శించారు. బ్రాండ్ ఆంధ్రా రివైవ్ అయితే మిగిలినవి అన్ని ఆటోమెటిగ్‌గా రివైవ్ చేయగలమని వివరించారు. విభజన తరువాత 5 ఏళ్లలో 13.5శాతం వృద్ధి సాధించినట్లు చెప్పుకొచ్చారు. ఇదే వృద్ధి కొనసాగి ఉండి ఉంటే ఏపీ పరిస్థితి మరోలా ఉండేదన్నారు. 2023-24లో ఏపీకి జీరో డెట్ సస్టైనబిలిటీ అని నీతి అయోగ్ చెప్పిందని.. దీనికి కారణం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టకపోవడమే అని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను మార్టిగేజ్ చేశారని.. లిక్కర్ భవిష్యత్తు ఆదాయాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. అప్పుల రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ భారీగా పెంచేశారని... దీంతో అప్పుపుట్టకపోవడంతో కేంద్ర పథకాలను డైవర్ట్ చేశారని ఆరోపించారు. రూ.48616 కోట్ల పెండింగ్ బిల్లులను రూ.29,259 కోట్లకు చెల్లించి తగ్గించగలిగామన్నారు. 86 కేంద్రప్రాయోజిత పథకాలను రివైవ్ చేశామన్నారు. రూ.45,138 కోట్లను కేంద్ర ప్రయోజిత పథకాలు కింద ఖర్చు చేయగలిగామని తెలిపారు. స్థానిక సంస్థలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు వచ్చినా వాటిని మళ్లించారని.. వాటిని కూడా సరిచేసినట్లు సీఎం తెలిపారు. ఇప్పటివరకూ రూ.49,401కోట్లు సంక్షేమంపై ఖర్చు చేశామన్నారు. మెగా డీఎస్సీ విషయంలో కోడిగుడ్లపై ఈకలు పీకుతున్నారంటూ మండిపడ్డారు.



## పొగాకు రైతుల కోసం అంటూ.. జగన్ రాజకీయం

**తక్కువ ధరక బియ్యం పంపిణీ కార్యక్రమంలో మంత్రి దుర్గేశ్**

**ఏలూరు, ఆగస్ట్ 4 :** తన ఉనికిని కాపాడుకోవడానికి జగన్ పొగాకు రైతుల కోసం అంటూ రాజకీయ యాత్ర చేపడుతున్నారని మంత్రి కందుల దుర్గేశ్ విమర్శించారు. నిడదవోలు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో తక్కువ ధరకు బియ్యం పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజలకు కూడా తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం ఇస్తామని చెప్పి అవి అడిగితే బూతులు తిట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇది రైతు ప్రభుత్వమని... ధాన్యం కొనుగోలు చేసిన గంటల్లోనే నగదు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎప్పుడైనా గిట్టుబాటు ధర ఇచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. మంత్రి దుర్గేశ్ స్వయంగా తూకం వేసి బియ్యాన్ని ప్రజలకు అందించారు. కార్యక్రమంలో డీఎస్ఓ పార్వతి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, తహసీల్దార్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చురుకుగా నైరుతి కదలికలు

**ఎల్లో హెచ్చరిక జారీ చేసిన వాతావరణశాఖ**

**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురసే అవకాశముందని వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో నిన్న ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీ మీటర్లు, వికారాబాద్, సంగారెడ్డిలో భారీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

## గుండ్లకమ్మ అటవీ ప్రాంతంలో పెద్దపులి మృతి కేసు


**అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**గుంటూరు, ఆగస్ట్ 4 :** మార్కాపురం జిల్లా గిద్దలూరు అటవీ డివిజన్, రాచర్ల బీట్‌లో ఉన్న గుండ్లకమ్మ అటవీ ప్రాంతంలో పెద్దపులి మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. గిద్దలూరుకు చెందిన అంజి, నంద్యాల జిల్లాకు చెందిన వీరాంజనేయులును గుంటూరు జిల్లా మేడికొండూరులో అరెస్ట్ చేశారు. ఆపై వారిద్దరినీ గిద్దలూరుకు తరలించారు. పెద్దపులి మృతిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయిన విషయం తెలిసిందే. పారదర్శక విచారణ చేపట్టాలని అటవీ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 20 రోజుల క్రితం మార్కాపురం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో ఉచ్చులో పడి పెద్దపులి మృతి చెందింది. కొందరు వ్యక్తులు పులి కాళ్లను నరికి గోళ్లను ఎత్తుకుపోవడం కలకలం రేపింది. పులి మరణంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. పెద్దపులి మృతి ఆదోళన కలిగించిందన్నారు. పులి మరణం వెనుక ఉన్న కారణాలను వెలికి తీయాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. పులిది సహజ మరణమా, వేటగాళ్ల దుశ్చర్య, విషప్రయోగం జరిగిందా అనే కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలన్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబాయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో పాటు ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో వరుసగా నాలుగు రోజుల సూచీల లాభాలకు బ్రేక్ పడింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన నిర్ణయాలు బుధవారం వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్ 210.08 పాయింట్లు క్షీణించి 78,428.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 159.40 పాయింట్లు పతనమై 24,614.90 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఇండిగో, టెక్‌మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 85.58 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,047.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# బిజినెస్




## వాట్సప్‌లో ఈ తప్పిదాలు చేస్తే.. మీ ఖాతా అండర్ రివ్యూలోకే!

**భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వాట్సప్ వినియోగదారులు మంగళవారం ఊహించని సమస్యను ఎదుర్కొన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పలువురి వాట్సప్ ఖాతాలు 24 గంటల పాటు 'అండర్ రివ్యూలోకి' వెళ్లాయి. దీంతో చాటింగ్, కాల్స్ వంటి ఫీచర్లు పనిచేయలేదు. దీనిపై యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేయడంతో కంపెనీ స్పందించింది. సేవలను దుర్వినియోగం చేసే ఖాతాలను గుర్తించడంలో భాగంగా కొంతమంది వాట్సప్ అకౌంట్లు రివ్యూలోకి వెళ్లాయని, సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తామని పేర్కొంది.**

సాధారణంగా యూజర్లు వాట్సప్‌లో చేసే కొన్ని పనుల వల్ల మెటా సదరు వ్యక్తుల ఖాతాలను సమీక్షించడానికి తాత్కాలికంగా 'అండర్ రివ్యూ'లో ఉంచుతుంది. కొన్నిసార్లు పూర్తిగా నిలిపివేసే ప్రమాదమూ ఉంది. అలా రివ్యూలోకి వెళ్లకుండా ఉండాలంటే వాట్సప్‌లో చేయకూడని కొన్ని పొరపాట్లు ఏంటో తెలుసుకుందాం..

- జీబీ వాట్సప్, వాట్సప్ ప్లస్, యోవాట్సప్ వంటి మెటాకు సంబంధం లేని అనధికారిక వెర్షన్లు వినియోగిస్తే యూజర్లు వాట్సప్ బ్యాన్ ముప్పు ఎదుర్కొనే అవకాశం ఉంది.
- ఒకే సందేశాన్ని ఎక్కువ మందికి ఒకేసారి పంపినా వాట్సప్ మీ ఖాతాపై చర్యలు తీసుకోవచ్చు. ముఖ్యంగా మీ నంబర్‌ను సేవ్ చేసుకోని వారికి ఒకే సందేశాన్ని ఎక్కువగా పంపడం వల్ల 'వాట్సప్ స్పామ్ డిటెక్షన్' మీ ఖాతాను గుర్తిస్తుంది.
- అనధికారికంగా థర్డ్-పార్టీ బాట్‌లు లేదా ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను వాడడాన్ని మెటా అనుమతించదు. వీటిని మాడిఫైడ్ యాప్‌లుగా పరిగణిస్తుంది. అలాంటి సందర్భంలోనూ మీ ఖాతాను రివ్యూలో ఉంచుతుంది.
- మీ ఫోన్ నంబర్‌ను తక్కువ సమయంలో ఎక్కువ మంది బ్లాక్ చేసినా లేదా రిపోర్టు చేసినా వాట్సప్ అప్రమత్తం అవుతుంది. మీ కంటెంట్‌ను మెటా చదవనప్పటికీ అసభ్యపదజాలం గల కంటెంట్‌గా సిస్టమ్స్ భావిస్తాయి.
- చట్టవిరుద్ధమైన, ద్వేషపూరిత లేదా అశ్లీల కంటెంట్‌ను షేర్ చేయడాన్ని వాట్సప్ తీవ్రంగా పరిగణిస్తుంది.
- మనుషులు పంపే వేగానికి మించి రాపిడ్ ఫాస్ట్‌గా పెద్ద మొత్తంలో సందేశాలు పంపినా రివ్యూ ఎదుర్కోవాల్సి వస్తుంది.
- వాట్సప్ నుంచి డేటాను సేకరించడానికి అనధికారిక స్క్రాపింగ్ టూల్స్ వాడితే వాట్సప్ చర్యలు తీసుకుంటుంది.
- తప్పుడు సమాచారాన్ని అడ్డుకోవడానికి వాట్సప్ ఇప్పటికే ఫార్వర్డ్ కంటెంట్‌పై పరిమితులు విధించింది. అలాంటి కంటెంట్‌ను మళ్లీ మళ్లీ పంపేందుకు ప్రయత్నిస్తే మీ ఖాతాను రివ్యూ చేసే అవకాశం ఉంటుంది.
- సాధారణంగా వాడే మెసేజింగ్ యాప్‌లో ఒక్కసారిగా మార్పులు రావడం.. అంటే పరిమితికి మించి కొత్త నంబర్లకు ఎక్కువ సంఖ్యలో సందేశాలు పంపడాన్ని అనుమానిత ఖాతాగా పరిగణించి వాట్సప్ మీ ఖాతాను రివ్యూ చేస్తుంది.
- వ్యాపార అవసరాల కోసం అధికారిక వాట్సప్ బిజినెస్ ఏపీఐ వాడకుండా, సాధారణ వాట్సప్ యాప్‌ను వినియోగించడం, బల్క్‌గా మెసేజ్‌లు పంపించడం వంటివి చేస్తే కూడా వాట్సప్ స్పామ్ అకౌంట్స్‌గా పరిగణించే అవకాశం ఉంది.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేవు

డిజిటల్ చెల్లింపుల్లో ఎంతో కీలకంగా మారిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై రుసుములు విధించే ఆలోచన లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రూ.3,000 దాటిన యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వర్తింపచేసేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ పరిశీలిస్తున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. డిజిటల్ చెల్లింపులు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని తేల్చి చెప్పింది. పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం 2007లోని సెక్షన్ 10ఏ ప్రకారం యూపీఐ ద్వారా జరిపే చెల్లింపులకు బ్యాంకులు, సేవా సంస్థలు ఎలాంటి రుసుమూ వసూలు చేయకూడదు. సీబీడీటీ నోటిఫికేషన్ ప్రకారం భీమ్-యూపీఐ, యూపీఐ క్యూఆర్, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్‌ను సున్నా శాతంగా నిర్ణయించారు. యూపీఐ లావాదేవీలు పూర్తి ఉచితంగానే ఉన్నప్పటికీ.. కొన్ని ప్రత్యేక లావాదేవీలకు వేర్వేరు నిబంధనలు వర్తిస్తాయి. వాలెట్ల ద్వారా యూపీఐ ఉపయోగించి జరిపే రూ.2,000 పైబడిన వర్తక లావాదేవీలకు గరిష్ఠంగా 1.1% ఇంటర్‌ఛేంజ్ రుసుము వర్తిస్తుంది. యూపీఐతో అనుసంధానించిన రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు సాధారణ క్రెడిట్ కార్డు ఎండీఆర్ వర్తిస్తుంది.




## భారీగా క్షీణించిన ఎల్ఐసీ షేర్లు..

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ షేర్లు భారీగా కుంగాయి. మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో దాదాపు 9 శాతం మేర పతనమయ్యాయి. ఎల్ఐసీలో ఆఫర్ ఫర్ సేల్ రూపంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 6.5 శాతం వాటా విక్రయ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కావడమే ఇందుకు కారణం. మొత్తం 82.22 కోట్లకు పైగా షేర్లను ఈ ఇష్యూ ద్వారా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్‌లో భాగంగా 11 శాతం డిస్కౌంట్‌కు షేర్లను విక్రయిస్తుండడం ఎల్ఐసీ షేర్ల క్షీణతకు కారణమైంది. సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎల్ఐసీ షేరు విలువ రూ.428.50గా ఉంది. ఈ ఇష్యూలో ఒక్కో షేరును రూ.382 ప్రాథమిక ధర వద్ద ప్రభుత్వం విక్రయిస్తోంది. దీంతో మంగళవారం ఉదయం ఎల్ఐసీ షేర్లు 9 శాతం మేర క్షీణించి రూ.390.50 వద్దకు చేరాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎల్ఐసీ షేరు 8.66 శాతం నష్టంతో రూ.391.40 వద్ద ముగిసింది. ఇష్యూకు పూర్తిగా స్పందన లభిస్తే కేంద్ర ఖజానాకు రూ.31 వేల కోట్లు లభించనున్నాయి. మంగళవారం రిటెయిలేతర మదుపర్లు, బుధవారం రిటెయిల్ మదుపర్లు ఆఫర్ ఫర్ సేల్‌లో పాల్గొనవచ్చు.



## కోహ్లీ లాంటి ప్లేయర్ మళ్లీ దొరకడు

### కోహ్లీపై రవిశాస్త్రి ప్రశంసల వర్షం

భారత క్రికెట్ దిగ్గజం క్రికెటర్‌పై మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించారు. అలాంటి ఆటగాడు భారత క్రికెట్‌కు మళ్లీ దొరకడం చాలా కష్టమని, అతను జట్టుకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అతను భారత జట్టుకు ఇన్ని సంవత్సరాలు ఆడటం దేశ క్రికెట్‌కు దక్కిన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ఇంతకీ ఆ ప్లేయర్ ఎవరు అని అనుకుంటున్నారా? ఇంకెవరు కింగ్ విరాట్ కోహ్లీ.రవిశాస్త్రి మాట్లాడుతూ.. "ఇన్ని సంవత్సరాలుగా విరాట్ కోహ్లీ భారత క్రికెట్‌కు లభించడం అదృష్టమని, అతని లేకపోవడం అతని గొప్పతనాన్ని మరింతగా చాటిచెబుతుందని తాను నమ్ముతున్నానని, అతనిలాంటి ఆటగాడు భారత క్రికెట్‌కు మరెన్నడూ దొరకడని రవిశాస్త్రి అన్నారు." అని అన్నారు. అలాగే ఒక వ్యక్తి విలువ అతను ఉన్నప్పుడు కంటే, అతను లేకపోయిన తర్వాతే ఎక్కువగా అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. కోహ్లీ కూడా అలాంటి ఆటగాడేనని, అతను జట్టులో లేకపోవడం ద్వారా అతని గొప్పతనం ఎంతటిదో అభిమానులు, క్రికెట్ ప్రపంచం మరింతగా గుర్తిస్తాయని చెప్పారు.టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లలో కోహ్లీ సాధించిన పరుగులు, ఎన్నో చారిత్రాత్మక విజయాల్లో పోషించిన పాత్ర, భారత జట్టును ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి జట్టుగా నిలబెట్టడంలో అతని కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయని రవిశాస్త్రి కొనియాడారు. కోహ్లీ కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడు రవిశాస్త్రి భారత జట్టు హెడ్ కోచ్‌గా పనిచేశారు. ఈ ఇద్దరి కలయికలో భారత్ విదేశాల్లో చారిత్రాత్మక టెస్టు విజయాలు నమోదు చేయడంతో పాటు, ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. అందుకే కోహ్లీ సామర్థ్యం, నాయకత్వం గురించి రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా బెన్ స్టోక్స్



న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్ ఓటమి అనంతరం ఇంటర్నేషనల్ క్రికెట్?కు వీడ్కోలు పలికిన ఇంగ్లాండ్ మాజీ టెస్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు. జూన్ 2026లో ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి తప్పుకున్న 35 ఏళ్ల ఈ లెజెండ్ ప్లేయర్, క్రికెట్‌కు పూర్తిగా దూరం కావడం లేదని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే వివిధ లీగ్‌లు, ఫ్రాంచైజీ టోర్నమెంట్లలో కొనసాగాలని నిశ్చయించుకున్నారు. రిటైర్మెంట్ ప్రకటించగానే నేరుగా కోచింగ్ లేదా కామెంట్రీ వైపు వెళ్లకుండా, యాక్టివ్ ప్లేయర్‌గానే మైదానంలో అడుగుపెట్టాలని ఆయన నిర్ణయించుకోవడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 లీగ్ బిగ్ బాష్ లీగ్లో ఆడేందుకు బెన్ స్టోక్స్ విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నారు. కోడ్ స్పోర్ట్స్ నివేదిక ప్రకారం.. అనేక బీబీఎల్ ఫ్రాంచైజీలు ఈ స్టార్ ఆల్‌రౌండర్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఇందులో 2026/27 సీజన్ కోసం బెన్ స్టోక్స్‌ను సైన్ చేసే రేసులో సిడ్నీ సిక్సర్స్ అందరికంటే ముందుంది. ఇంగ్లాండ్ మాజీ వైట్-బాల్ కోచ్ మాథ్యూ మోట్ ప్రస్తుతం సిడ్నీ సిక్సర్స్ జట్టుతో ఉండటం వారికొక పెద్ద అడ్వాంటేజ్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లోనే ఇంగ్లాండ్ జట్టు ఆస్ట్రేలియాలో 2022 టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ఆనాడు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో స్టోక్స్ నాటౌట్‌గా 52 రన్స్ చేసి మ్యాచ్ విన్నర్‌గా నిలిచారు. బెన్ స్టోక్స్‌కు బిగ్ బాష్ లీగ్ కొత్తేమీ కాదు. ఆయన గతంలో 2014/15 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడి తన సత్తా చాటారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సిడ్నీ సిక్సర్స్‌తో పాటు హోబార్ట్ హరికేన్స్ కూడా స్టోక్స్‌ను దక్కించుకోవాలని ఆరాటపడుతోంది. క్రికెట్ టాస్మానియా మేనేజ్‌మెంట్ ఇప్పటికే ఈ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్‌ను తమ జట్టు వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ప్రస్తుతం స్టోక్స్ తన హోమ్ కౌంటీ అయిన డర్హామ్ జట్టు తరఫున కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నారు. ఈ భారీ డీల్ విలువ దాదాపు 600,000 ఆస్ట్రేలియన్ డాలర్లు ఉండవచ్చని సమాచారం. రాబోయే బీబీఎల్ సీజన్లలో కనీసం కొన్ని మ్యాచ్‌లకైనా స్టోక్స్ ఆడేలా ఒప్పందం కుదుర్చుకోవాలని క్రికెట్ ఆస్ట్రేలియా భావిస్తోంది. ఈ డీల్ గనుక పూర్తయితే, బిగ్ బాష్ లీగ్ చరిత్రలోనే అత్యంత భారీ ధర పొందిన విదేశీ క్రికెటర్‌గా బెన్ స్టోక్స్ ఆల్-టైమ్ రికార్డు సృష్టిస్తారు.

# రహానేపై సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు



టీమిండియా మాజీ క్రికెటర్ అజింక్యా రహానేపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత క్రికెట్‌లో అజింక్యా రహానే అజాత శత్రువని కొనియాడాడు. రహానే సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడని కొనియాడాడు. అయినా రహానేకు భారత క్రికెట్‌లో అన్యాయ-ంమే జరిగిందని, రావాల్సిన గుర్తింపు రాలేదని పేర్కొన్నాడు. ఇటీవల అజింక్యా రహానే అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తన నిర్ణయాన్ని వెల్లడిస్తూ రహానే భావోద్వేగానికి గురయ్యాడు. రహానే రిటైర్మెంట్‌పై తాజాగా స్పందించిన గవాస్కర్.. రాహుల్ ద్రవిడ్ తరహాలోనే అతని సారథ్యానికి తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. 'కెప్టెన్‌గా అజింక్యా రహానేకు అద్భుతమైన రికార్డ్ ఉంది. అతను 6 టెస్ట్‌లకు కెప్టెన్సీ చేస్తే.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ భారత్ అద్భుతమైన విజయాలు సాధించింది. కానీ అతనికి దక్కాల్సిన గుర్తింపు రాలేదు. అలాగే రహానే నాయకత్వానికి కూడా గుర్తింపు లభించలేదు. అయితే భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రదర్శనలను కొనియాడటం.. ఓడినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లను నిందించడం సాధారణమే.2021 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్ట్‌లో టీమిండియా 36 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఆ తర్వాత కోచ్ రవిశాస్త్రితో కలిసి రహానే జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించి సిరీస్ అందించాడు. వాస్తవానికి గబ్బా టెస్ట్‌కు స్టార్ ఆటగాళ్లంతా గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకుండా పోయారు. అయినా కుర్రాళ్లతో రహానే జట్టును అద్భుతంగా నడిపించి గొప్ప విజయాన్ని అందించాడు. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి వైదొలిగాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు'అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# ఐదేళ్ల ప్రయాణం చిరస్మరణీయం..

### టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ భావోద్వేగం!



టీమిండియా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్న టీ దిలీప్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా తన ప్రయాణం ముగిసిందని, ఈ ఐదేళ్లు తన జీవితంలో మధుర జ్ఞాపకంగా మిగిలిపోతాయని పేర్కొన్నాడు. హైదరాబాద్‌కు చెందిన టీ దిలీప్ 2021లో టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. తన హయాంలో జట్టులో అద్భుతమైన మార్పు తీసుకొచ్చాడు. ముఖ్యంగా డ్రెస్సింగ్ రూమ్‌లో బెస్ట్ ఫీల్డర్ అవార్డ్‌ను ప్రవేశపెట్టి ఆటగాళ్ల లో పోటీతత్వాన్ని పెంచాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత టీమిండియా ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోయాయి. ముఖ్యంగా ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో భారత జట్టు ఘోర పరాజయాలను చవిచూడటంతో టీ దిలీప్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ పొడిగించలేదు. దాంతో అతని స్థానంలో శుభదీప్ ఘోష్ నూతన ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దిలీప్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నాడు. తనకు సహకరించిన కెప్టెన్లు, కోచ్‌లు, ఆటగాళ్లతో పాటు బీసీసీఐ కృతజ్ఞతలు తెలిపాడు.'ఈ ఐదేళ్ల ప్రయాణం గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. టీమిండియా సపోర్ట్ స్టాఫ్‌లో చేరే ముందే.. నా సర్వస్వం ఇవ్వాలని భావించాను. తొలి రోజు నుంచి అదే లక్ష్యంతో పనిచేశాను. ఫీల్డింగ్ కోచ్‌గా జట్టుతో ప్రయాణం చేయడం పట్ల నేను కృతజ్ఞుడినై ఉంటాను. ఫీల్డింగ్ మెడల్ అనేది మా మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ మెడల్ ప్రదానం ద్వారా డ్రెస్సింగ్ రూమ్‌లో ఒక ఆహ్లాదకర వాతావరణం సృష్టించాం. ఫీల్డింగ్ కోచ్‌గా ఈ జ్ఞాపకాలు నా మదిలో ఎప్పటికి నిలిచిపోతాయి. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024, 2026, ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఆసియా కప్ 2023, 2025 ట్రోఫీలు గెలిచిన భారత జట్టులో నేను భాగమే. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023, వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ చేరిన జట్టులో కూడా ఉన్నాను. ఈ ప్రయాణం నాకెన్నో చిరస్మరణీయమైన జ్ఞపకాలను ఇచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన బీసీసీఐకి ప్రత్యేక ధన్యవాదాలు.నాపై నమ్మకం ఉంచి కొనసాగించిన రాహుల్ ద్రవిడ్, గౌతమ్ గంభీర్‌కు కృతజ్ఞతలు. ఈ ఇద్దరితో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్.. కెప్టెన్లుగా ఉన్న సమయంలో భారత క్రికెట్‌కు నా వంతు సేవ చేయడాన్ని గొప్పగా భావిస్తున్నా. ఈ ప్రయాణంలో నాతో ఉన్న ప్రతీ ఆటగాడు, కోచ్, సహాయక సిబ్బందిలోని ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. ఇప్పుడిక ఈ అధ్యాయం ముగిసిపోయింది. నా ప్రయాణం మాత్రం కొనసాగుతోంది.'అని టీ దిలీప్ ఏమోషనల్‌గా రాసుకొచ్చాడు.

జనం వార్త



## శూర్పణఖ పాత్ర సంక్లిష్టమైనది : రకుల్

మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి రకుల్ ప్రీత్ సింగ్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానని ఆ పోస్ట్‌లో పేర్కొంది.

## కరుప్ప విడుదల సమయంలో ఆర్థిక ఇబ్బందులు

### జ్యోతిక సమయానికి ఆదుకుందన్న సూర్య

ఇటీవల 'కరుప్పు'తో విజయాన్ని అందుకున్నారు అగ్ర కథానాయకుడు సూర్య. అయితే ఈ సినిమా సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అందించిన మద్దతును తాజాగా గుర్తు చేసుకున్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఈ అంశంపై మాట్లాడారు. కరుప్పు సినిమా విడుదలకు ముందు చివరి నిమిషంలో ఆర్థిక పరమైన, పంపిణీ సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో సినిమాను థియేటర్లలో ప్రదర్శించడం కోసం అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. అది మా కుటుంబానికి పెద్ద రిస్క్. కానీ, జ్యోతిక నాపై ఉంచిన నమ్మకమే నేను ధైర్యంగా ముందడుగు వేసేలా చేసింది. ఆ రిస్క్ విషయంలో ఆమె నాకు కొండంత అండగా నిలిచిందని సూర్య పేర్కొన్నారు. దీనిపై ఇదే ఇంటర్వ్యూలో జ్యోతిక స్పందిస్తూ.. ఆ సినిమా విషయంలో పూర్తి ఘనత సూర్యకే చెందుతుందన్నారు. నేను ఈ ప్రశంసను స్వీకరించను. మేము ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటాం. పిల్లల పెంపకం విషయంలోనూ మేమిద్దరం ఎప్పుడూ ఒకే అభిప్రాయంతో ఉంటాం. ముందు మేం చర్చించుకుని తర్వాత పిల్లలకు వివరిస్తాం అని తెలిపారు. ఇక 'కరుప్పు' గురించి సూర్య మాట్లాడుతూ.. ఆర్.జే బాలాజీ ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రెండున్నర సంవత్సరాలు కష్టపడ్డారని అన్నారు. ఈ సినిమా విజయం చాలా మంది జీవితాలను మార్చేసిందని తెలిపారు. ఫైనాన్షియర్లు కూడా సహకరించారని వెల్లడించారు. సూర్య, త్రిష ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది.



## ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్

### నిరంతరాయంగా షూటింగ్ కోసం ప్లాన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి





ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

## డీప్‌ఫేక్ ఫోటోలపై మృణాల్ ఆగ్రహం

### తక్షణం తొలగించకపోతే చర్యలు

కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫొటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్ మార్ఫింగ్ ఫొటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా డీప్‌ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫొటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫొటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.





## రామాయణపై అనుమానాలు ఉన్నాయి

### విడుదలకు ముందే చూపిస్తే మంచిది

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. ఢిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.

## 20 గంటలు పనిచేస్తూనే ఉన్నా..

ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన సినిమా షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉంటున్నారో తెలుపుతూ ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. కంటిమీద కునుకు లేకుండా వరుస షూటింగ్స్‌లో పాల్గొన్నట్లు వెల్లడించారు. తన వర్క్ షెడ్యూల్ ఎంత కష్టంగా ఉందో వివరిస్తూ కీర్తి సురేశ్ ఓ వీడియోను పోస్ట్ చేశారు. తీవ్ర అలసట కారణంగానే తాను ఈ వీడియోను ఆలస్యంగా పోస్ట్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. "నిన్న ఈ వీడియోను పోస్ట్ చేసే ఓపిక కూడా నాకు లేదు. ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్‌కు వెళ్తూనే ఉన్నా. నిన్న ఉదయం 6 గంటలకు నా గదిలోంచి బయలుదేరాను. మళ్లీ ఇప్పుడు ఉదయం 6 గంటలు అవుతోంది. దాదాపు 24 గంటల తర్వాత నా గదిలోకి అడుగుపెట్టాను. అందులో 20 గంటల పాటు పనిలోనే ఉన్నాను. అసలు విషయం ఏమిటంటే.. మళ్లీ ఇంకో గంట లో నా తర్వాతి షూటింగ్ కోసం బ యలుదేరాలి. ఇలాంటి సమస్యల గురించి ఫిర్యాదు చేయడం కూ డా మంచిదే. జీవితం అంటే ఇదే కదా? దీన్ని నేను ఓ ఆ శీర్వాదంగా భావిస్తున్నాను" అని కీర్తి పేర్కొన్నారు. శారీర కంగా ఎంత శ్రమపడినా కీర్తి సురేశ్ తన ఉత్సాహాన్ని కో ల్పోలేదు. విరామ సమ యంలో తీసిన ఓ మిర్రర్ సెల్ఫీని అభిమానులతో పంచుకున్నారు.



## సల్మాన్ రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు

### మంచి సినిమా నిర్మించాలన్నదే లక్ష్యం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు. ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో కూడిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ కూడా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార కూడా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.



PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com